గోలేటి జీఎం కార్యాలయంలో మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన, ఫిబ్రవరి 18: సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలని సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ సూచించారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో మంగళవారం పేపర్ లెస్ విధానాన్ని సింగరేణి సంస్థ తీసుకువస్తున్నదన్నారు. కాగితాలకు ప్రత్యామ్నాయంగా వినియోగించే శాప్ ఫైల్ లైఫ్ సైకిల్‌పై ఐటీ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం మాట్లాడుతూ పేపర్ లెస్ విధానంలో బెల్లంపల్లి ఏరియా ముందుండాలని అధికారులకు సూచించారు. ఏప్రిల్‌లో సింగరేణి వ్యాప్తంగా పేపర్ లెస్ ప్రక్రియ అమలు కానుందన్నారు.ఈ విధానంపై కార్పొరేట్ ఐటీ అధికారులు వివరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐటీ ఇన్‌చార్జి ముజీబ్, కార్పొరేట్ ఐటీ అధికారులు హరప్రసాద్, కిరణ్‌కుమార్, శంకర్, రమ్య, పలువురు ఉన్నారు.

మందమర్రిలో కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మందమర్రి, ఫిబ్రవరి 18: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. సింగరేణి మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌ను మంగళవారం సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రేడ్స్‌మెన్‌లకు టూల్స్‌కిట్‌లు ఇవ్వాలని, అవుట్ డోర్‌కు వెళ్లే కార్మికులు వాహన సదుపాయం కల్పించాలని, గ్యారేజ్ సెక్షన్‌లో సర్వీసింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని తదితర సమస్యలను కార్మికులు వివరించగా బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ వర్క్‌షాప్ యాక్టింగ్ డీవైజీఎం కృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. పరిష్కారానికి కృషి చేస్తానని డీవైజీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలోని కేకే డిస్పెన్సరీ నుంచి పాలచెట్టు వరకు కోల్‌బెల్ట్ రహదారిలో గుంతలు ప్రమాదకరంగా మారాయని వాటిని పూడ్చి వేయాలని సూచించారు. ఏరియా జీఎం జీ.దేవేందర్ స్పందించి రోడ్డు మరమ్మతు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేశం, సంయుక్త కార్యదర్శి కంది శ్రీనివాస్, నాయకులు ఎగ్గేటి రాజేశ్వర్ రావు, అంథోని దినేశ్, కన్నం వేణు, పారిపెల్లి రాజేశం, తోట వెంకటస్వామి, కిరణ్, రాజయ్య, రమేశ్, వెంకట్రావు, సదానందం, కుమార్, సత్యనారాయణ, రవీందర్, సురేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ జీఎం శ్రీనివాస్‌కు సన్మానం

రెబ్బెన, ఫిబ్రవరి 18: బెల్లంపల్లి ఏరియా జీఎంగా విధులు నిర్వహించి శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా బదిలీ అయిన ఎం.శ్రీనివాస్ ను మంగళవారం సాయంత్రం గోలేటి జీఎం కార్యాలయంలో టీబీజీకేఎస్ యూనియన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, కేంద్ర కమిటి ఉపాధ్యక్షుడు దరావత్ మంగిలాల్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, కేంద్ర కమిటి సభ్యులు గజెల్లి చంద్రశేఖర్, ఓరం కిరణ్, మాంతు సమ్మయ్య, పిట్ కార్యదర్శి బొంగు వెంకటేశ్, గణపతి, నాయకులు కైత స్వామి, అనీశ్, సురేశ్ లతో పాటు పలువురు ఉన్నారు.

గోలేటి జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం శ్రీనివాస్ ను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ఏరియా అధికారుల ఆధ్వర్యంలో..

బెల్లంపల్లి ఏరియా జీఎంగా విధులు నిర్వహించి శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా బదిలీ అయిన ఎం.శ్రీనివాస్ ను ఏరియా లోని ఉన్నత అధికారులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి ఏరియా కు జీఎం అందించిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఖైర్‌గూడ పీవో మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ రామనాథం, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం(సెక్యూరిటీ) ఉమాకాంత్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, సివిల్(ఎస్ఈ) మదీ నబాషా, సీహెచ్‌పీ ఇన్‌చార్జి కోటయ్య, ఖైర్‌గూడ పీఈ వీరన్న, తదితరులున్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి భాగ్యరెడ్డి వర్మ

వాంకిడి,ఫిబ్రవరి 18 : అణగారిన వర్గాలకు ఆత్మస్థైర్యం నింపేందుకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అనేక సంఘ సేవ కార్యక్రమా లను నిర్వహించిన అణగారినా వర్గాల ఆశాజ్యోతి భాగ్యరెడ్డి వర్మ అని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహూల్కర్ అన్నారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రంలోని బుద్ధ విహార్‌లో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ 86వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ కేంద్రంగా కుల నిర్మూలన కార్యక్రమాలను నిర్వహిస్తూ బడుగు బలహీన ప్రజలపై ధైర్యాన్ని నింపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సమాజ్ అధ్యక్షులు విలాస్ కొబ్రాగడే, మనోజ్ ఉప్రే, యేష్పాల్ ఉప్రే, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు దుర్గం ప్రశాంత్, కిరణ్, రాంటెకె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

రెబ్బెన, ఫిబ్రవరి 18: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసినా అక్రమంగా డంప్ చేసినా కఠిన చర్యలు తప్పవని రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. రెబ్బెన మండలంలోని గొల్లగూడ దగ్గరలో ఇసుక డంప్‌లను మంగళవారం రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఏడీ మైనింగ్ గంగాధర్‌తో కలిసి పరిశీలించి సీజ్ చేసిన అనంతరం మాట్లాడారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారినైన ఉపేక్షించేదిలేదన్నారు. అక్రమ రవాణా అక్రమ డంప్ చేసే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో పోలీసు, రెవెన్యూ, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ బోధనపై అవగాహన కలిగి ఉండాలి

దండేపల్లి, ఫిబ్రవరి18: రానున్నది డిజిటల్ కాలమేనని ప్రతి ఉపాధ్యాయుడూ డిజిటల్ బోధనపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో చిన్నయ్య అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాలకూ ప్రభుత్వం మూడు ఐఎఫ్‌పీ బోర్డులు ఇచ్చిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మురళిధర్, శిక్షకులు సతీశ్, శ్రీకాంత్, అంకూస్, వినోద్ ఉన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 18 :రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు మార్చి 8న జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవన సముదాయంలో మార్చ్ 8వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో క్రిమినల్, సివిల్, ప్రి లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యలు, వివాహం, కుటుంబ సమస్యలు, మోటార్ వాహనాల ప్రమాదాల కేసులు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ ఇతర అన్ని రకాల కేసులను ఇరు పార్టీల మధ్య రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారంతో కాలం వృథా కాకుండా ఆర్థికంగా కూడా లాభం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మొదటి బెంచ్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వీ. రమేశ్, 2వ బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ, 3వ బెంచ్ లో జూనియర్ సివిల్ జడ్జ్-సిర్పూర్ (టి), ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి-ఆసిఫాబాద్ జే అనంతలక్ష్మి న్యాయాధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ నెల 20వ తేదీన సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలో గల ప్రిన్సిపల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జి కోర్టు హాల్‌లో పోలీసు ఉన్నతాధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రేడ్జారు సింగరేణి ఉద్యోగులకు కౌన్సెలింగ్

కాసిపేట, ఫిబ్రవరి 18 : మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై గ్రేడ్జారు సింగరేణి ఉద్యోగులకు గని మేనేజర్ లక్ష్మీ నారాయణ కౌన్సెలింగ్ ఇచ్చారు. అండర్ గ్రౌండ్ ఉద్యోగులు 16 కన్న తక్కువ మస్టర్లు, సర్ఫేస్ ఉద్యోగులు 20 మాస్టర్లు కన్న తక్కువ డ్యూటీలు చేసిన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రేడ్జారుతో కంపెనీకి, ఉద్యోగుల కుటుంబాలకు జరిగే నష్టాన్ని ఉద్యోగులకు గని మేనేజర్ వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, గని పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులపై కేసు

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 18 : చెన్నూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే వసతి గృహాన్ని జైపూర్ వెంకటేశ్వర్లు మంగళవారం సందర్శించారు. వసతిగృహంలో గొడవ, విద్యార్థుల ఆందోళన విషయంపై విచారణ చేయాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సోమవారం ఏసీపీకి ఆదేశాలు జారీ చేశారు. దీంతో హాస్టల్‌ను చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్‌తో కలిసి ఏసీపీ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఘటన విషయంపై విద్యార్థులు, పాఠశాల సిబ్బందిని విచారించారు. విద్యార్థుల మధ్య గొడవ నేపథ్యంలో దాడికి పాల్పడిన ఏడుగురు విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థులను ధర్నాకు ప్రేరేపించినట్లు విచారణలో తేలితే వారిపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. నివేదికను కలెక్టర్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

ఎంఈవో, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

కాగజ్‌నగర్‌లో ఆగని చోరీలు ..!

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18: కుమ్రం భీం జిల్లా అసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలో తరచూ చోరీలు జరుగుతున్నప్పటి సంబంధీత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రాత్రి 8 గంటల నుంచి 8.30 గంటల ప్రాంతంలో నిలిపి ఉన్నా రెండు ఆటోలకు చెందిన బ్యాటరీలు దుండగుడు ఎత్తుకెళ్లాడు. పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలో రద్దీగా ఉండే ప్రాంతంలో నిలిపి ఉన్న ఆటోల్లోని రెండు బ్యాటరీలు చోరీకి గురవడం విస్మయానికి గురిచేస్తుంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు సంప్రదించగా బ్యాటరీలు చోరీకి గురైన విషయం వాస్తవమే, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణ పోలీసులు సీసీ టీవీ కెమెరాలు పరిశీలించారు. పట్టణంలో చోరీలకు రాత్రి పగలు తేడా లేకుండా దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో తరచూ చోరీలు జరుగడంతో ప్రయాణీకులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో పట్టణ పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటుకు వ్యాపారులతో సంప్రదించినట్లు తెలుస్తున్నది. సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారులు సముఖంగా లేనట్లు తెలుస్తున్నది. పట్టణంలో ఈ నెల 4న పట్టణంలోని ఒక బంగారు దుకాణంలో సుమారు తులం బంగారం చోరీకి గురైంది. కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు మహిళలు అసలు బంగారు ఆభరణం చోట నకిలీ బంగారు ఆభరణం పెట్టి రెండు జతల చెవి కమ్మలు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తున్నది. సంబంధీత ఉన్నతాధికారులు పట్టించుకొని పట్టణంలో చోరీలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ ఆవరణలో చోరీకి వచ్చిన వ్యక్తి సీసీ టీవీ పూటేజీ